క్లుప్తంగా

నీటిఎద్దడి నివారించాలి



వీపనగండ్ల: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండ గ్రామంలో ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని పుల్గర్‌చర్ల గ్రామస్థులు మంగళవారం పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో మిషన్‌భగీరథ పథకం ద్వారా సక్రమంగా నీటి సరఫరా జరగడం లేదని, వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారులు తమ అవసరాలకు అనుగుణంగా నీటి వసతులు కల్పించాలని వారు కోరారు.

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి



వనపర్తి టౌన్: ఏప్రిల్‌లో నిర్వహించే వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి యుగంధర్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కేడీఆర్ ప్రాథమిక పాఠశాలలో తొలి మెట్టు కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఈ మేరకు పాఠశాలలో 4, 5వ తరగతి విద్యార్థుల తొలి మెట్టు సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్ భాష సామర్థ్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ధారాళంగా చదవడం, సొంత మాటల్లో చెప్పగలడం, రాయడం చేస్తున్నారన్నారు.

ఆటో, బైక్ ఢీ.. ఐదుగురికి గాయాలు

కొత్తకోట రూరల్: ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కొత్తకోట మదర్ థెరిస్సా జంక్షన్ సమీపంలో ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. జోగులాంబ జిల్లా రాజోళి మండలంలోని గార్లపహాడ్ గ్రామానికి చెందిన రాజు, నాగన్న, కృష్ణ మరో వ్యక్తి మహబూబ్‌నగర్‌లో పని నిమిత్తం ఆటోలో బయలు దేరారు. వడ్డెవాట గ్రామం నుంచి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై కొత్తకోటకు వెళ్తుండగా.. బైక్ సడన్‌గా హైవేపైకి రావడంతో ఆటో డ్రైవర్ బ్రేక్ వేయడంతో ఆటో, బైక్ ఢీకొనడంతో ఆటోలో ఉన్న ముగ్గురికి బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించి, క్షతగాత్రులను కొత్తకోట ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

ప్రపంచ శాంతికి ప్రార్థనలు



ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు బుధవారం రాత్రి స్థానిక మసీదే ఇమాదుల్ ఉలూంలో స్టార్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలానా జియాఉర్‌రెహ్మాన్ ప్రపంచ శాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రహ్మతుల్లా, మీసేవ ఫిరోజ్, మహ్మద్‌రఫీ, ఇస్మాయిల్, సాదీక్, కరెంటు ఇస్మాయిల్, సనసాదీక్, హనీఫ్, ఖుద్దూస్, కాదర్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపుపై దాడి.. మద్యం సీజ్

కొత్తకోట రూరల్: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. గ్రామాల్లో ఓటర్లను మద్యంతో ప్రలోభపెడతారనే ఉద్దేశంతో గ్రామాల్లో నడుస్తున్న బెల్ట్ షాపులపై దాడులను నిర్వహిస్తున్నారు. వడ్డెవాటలో రెండు బెల్ట్‌షాపులపై ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి సిబ్బందితో దాడి చేయగా.. చింపిరి బాలకృష్ణపై షాపులో రూ.8,802 విలువ గల రూ.19.50లీటర్ల మద్యం, మండ్ల గిరిబాబు షాపులో 13.43లీటర్ల మద్యం దొరకగా.. రూ.4,275 విలువ ఉంటుందన్నారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురంలో దొడగుంట మల్లేష్ కిరాణం షాప్‌లో మద్యం అమ్ముతున్నాడని సమాచారంతో బుధవారం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. 12 బీర్లు, 20 క్వాటర్లు పట్టుబడ్డాయని, షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మల్లేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



పాన్‌గల్ పీహెచ్‌సీలో వైద్యుల కొరత

- రోగులకు అందని వైద్యం
- సరిపడా సిబ్బంది లేక ఇబ్బందులు
- తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్‌కు పరుగులు



పాన్‌గల్ పీహెచ్‌సీలో డాక్టర్ లేక ఖాళీగా ఉన్న కుర్చీ



తెరుచుకోని అన్నారం వెల్‌నెస్ సెంటర్

పాన్‌గల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సరైన డాక్టర్లు, సిబ్బంది లేక రోగులకు వైద్యం అందక ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో 28 గ్రామ పంచాయతీలకు కలిపి మండల కేంద్రంలో ఒకే పీహెచ్‌సీ ఉంది. ఇందులో 6 పడకలు ఉన్నాయి. వివిధ గ్రామాల నుంచి ప్రతి నిత్యం గర్భిణులు, ఇతర పరీక్షల కోసం రోగులు వంద మంది వరకు ఆస్పత్రికి వస్తుంటారు. కానీ ఆస్పత్రిలో సరిపడా వైద్య సిబ్బంది లేకపోవడంతో మెరుగైన వైద్య సేవలు అందడం లేదని రోగులు వాపోతున్నారు.

10 ఉప కేంద్రాలు

ఈ పీహెచ్‌సీ పరిధిలో 10 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. ఉన్న సిబ్బంది కూడా సాయంత్రం వరకు విధులు నిర్వహించాల్సి ఉండగా.. వారు మధ్యాహ్నం నుంచే ఇంటికి వెళ్తుండటంతో వైద్య సేవలకు ఇబ్బందులు తప్పడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో సిబ్బందిని నియమించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మండల పీహెచ్‌సీ పరిస్థితి..

మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు ఉండాల్సి ఉండగా.. రెండు నెలలుగా ఒక్క డాక్టర్ కూడా లేకపోవడంతో వెల్‌నెస్ కేంద్రాల్లో ఉండే ఎంఎల్‌హెచ్‌పీలే పీహెచ్‌సీలో విడతలు వారీగా విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో పాటు ల్యాబోరేటరీలో ల్యాబ్ సిబ్బంది లేకపోవడంతో పరీక్షలు నిర్వహణ కొనసాగట్లేదు. దీంతో పాటు సీనియర్ అసిస్టెంట్, అటెండర్, వాచ్‌మెన్, స్వీపర్ వంటి పోస్టులు కూడా పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం 12 గంటల ఆస్పత్రిగా ఉన్న పీహెచ్‌సీని సిబ్బందిని నియమించి 24 గంటల ఆస్పత్రిగా మారుస్తామని గతంలో అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినా.. అడుగులు ముందుకు పడట్లేదు.

మూతపడిన వెల్‌నెస్ కేంద్రాలు

మండలంలోని రేమద్దుల, అన్నారం, చింతకుంట, మాందాపూర్, తెల్లరాళ్లపల్లి, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వెల్‌నెస్ కేంద్రాలు ఎప్పుడు మూతపడి ఉంటున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పీహెచ్‌సీలో సరైన సిబ్బంది లేకపోవడం, వెల్‌నెస్ కేంద్రాలు తెరుచుకోకపోవడంతో గ్రామీణులకు మెరుగైన వైద్యం ఎలా అందుతాయని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

వైద్యం అందట్లేదు

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన వెల్‌నెస్ కేంద్రాలు తెరుచుకోకపోవడంతో గ్రామీణులకు సరైన వైద్యం అందడంలేదు. దీంతో మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వెళ్తే అక్కడ డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. దీంతో పేదలకు ఇబ్బందులు తప్పడంలేదు.

– రాములు, మాజీ సర్పంచ్, అన్నారం

రెగ్యులర్ డాక్టర్లను నియమించాలి

పీహెచ్‌సీలో సరైన డాక్టర్లు, సిబ్బంది లేక రోగులకు వైద్య సేవలు అందడం లేదు. దీంతో పాటు గ్రామీణ ప్రాంతంలోని వెల్ నెస్ కేంద్రాలు కూడా సక్రమంగా తెరుచుకోకపోవడంతో రోగులు, పేదలు వైద్యానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– బాల్యానాయక్, తెల్లరాళ్లపల్లితండా

ఖాళీలు భర్తీ చేస్తాం

పాన్‌గల్ పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. ఎన్నికల కోడ్‌తో సిబ్బంది నియామకంలో జాప్యం జరుగుతుంది. ప్రస్తుతం వెల్‌నెస్ కేంద్రాల్లోని ఎంఎల్‌హెచ్‌పీలతో వైద్య సేవలు అందిస్తున్నాం. కోడ్ పూర్తైన వెంటనే ఖాళీలను భర్తీ చేస్తాం. విధుల్లో అలసత్వం వహించి కేంద్రాల్లో వైద్య సేవలు అందించకుంటే సమగ్ర విచారణ జరిపి వారిపై తగు చర్యలు తీసుకుంటాం.

– డా.శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

నాగదేవతల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ శివ, రామాలయం వద్ద బుధవారం నాగదేవతల విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని కనులపండువగా చేశారు. గ్రామానికి చెందిన దాతలు రంగారెడ్డి, శ్రీలత దంపతులు ముందుండి కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయం వద్ద మహాస్నపనం, దీక్షా, రక్షా, శాంతి, ఆవాహిత, దేవతా హోమాలు చేశారు. ఉదయం 10:45 కు వృషభలగ్న శుభపుష్కరాంశమున యంత్ర, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కొనసాగించారు. అనంతరం ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి తదితర పూజలు చేశారు. ప్రతిష్ఠామహోత్సవం సందర్భంగా ఆలయం వద్ద దాతలు అన్నదానం చేపట్టారు. గ్రామంతో పాటుగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పూజాకార్యక్రమంలో పాల్గొని నాగదేవతల ప్రథమ దర్శనం చేసుకున్నారు.



సృజనాత్మకతను పెంచేందుకే సైన్స్‌ఫేర్

ఆత్మకూర్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఫేయిర్ కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆత్మకూర్‌లోని ఎంవీరామన్ పాఠశాలలో బుధవారం రెండో రోజు నిర్వహించిన సైన్స్ ఫేయిర్ కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. మాజీ ఎమ్మెల్యేతో పాటు పలువురు ప్రముఖులు సందర్శించారు. ఈసందర్భంగా మాజీ ఎంపీపీ డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్, ప్రిన్సిపాల్ ఆన్సి శ్రీధర్ విద్యార్థులను అభినందించి వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, విండో అధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కోటేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ వండర్ బుక్ రికార్డు కైవసం

ఎంవీరామన్ హైస్కూల్‌కు అరుదైన గౌరవం లభించింది. పాఠశాల 35 వసంతాల ఉత్సవాల సందర్భంగా ఇక్కడి విద్యార్థులు 650 రకాల సైన్స్ ఎక్స్‌పో ప్రదర్శించడంతో ఇంటర్నేషనల్ వండర్ బుక్ రికార్డు నెలకొల్పి అవార్డును దక్కించుకుంది. ఈ మేరకు సంస్థ జాతీయ ప్రతినిధి బింగి నరేంద్ర, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ చేతులమీదుగా అవార్డు, ప్రశంసాపత్రం పాఠశాల చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌గౌడ్, ప్రిన్సిపాల్ ఆన్సి శ్రీధర్‌కు అందజేశారు.



శ్రీధర్‌గౌడ్, ఆన్సీ శ్రీధర్‌కు అవార్డులను అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

అంగన్‌వాడీ కార్యకర్తను ఆదుకోవాలి

పెబ్బేరు రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన అంగన్‌వాడీ కార్యకర్త అలివేలను ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు పుట్ట ఆంజనేయులు, మండ్ల రాజు బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని డీడబ్ల్యూఓ లక్ష్మీబాయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ పాన్‌గల్ మండలంలోని శాగాపూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త అలివేల ఈ నెల 19న పోషణ పక్వాడ్ కార్యక్రమానికి హాజరవుతున్న సందర్భంగా బైక్‌పై నుంచి కిందపడి గాయపడడంతో గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. అంగన్‌వాడీ ఉద్యోగులపై ఉన్నతాధికారుల వేధింపులు ఆపడంతో పాటు అలివేల కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాము, నారాయణమ్మ, రాధ, కవిత, జ్యోతి, శారద, గోవిందమ్మ, సుగుణాబాయి, సుమతి, వెంకటేశ్వరమ్మ, రాధ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



డీడబ్ల్యూఓ లక్ష్మీబాయికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చేపల చెరువుల సందర్శన

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరిలో మత్స్యకారులు ఏర్పాటు చేసిన చేపల చెరువులను మంగళవారం పెబ్బేరు మత్స్యకళాశాల విద్యార్థులు సందర్శించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాంలో భాగంగా ఈ చెరువులను సందర్శించి చేపల చెరువుల ఏర్పాటు, చేపల పెరుగుదల తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు కళాశాల అసిస్టెంట్ డీన్ నాగలక్ష్మి తెలిపారు. ఆరోగ్యకరమైన చేపల పెరుగుదలకు శాస్త్రీయంగా తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు వివరించారు. మత్స్య సంపద పెరుగుదల కోసం చేపట్టాల్సిన చర్యలపై క్షేత్రస్థాయి పరిశీలన ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి దేవానంద్, చేపల చెరువుల నిర్వాహకులు గణేష్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



గోవర్ధనగిరిలో చేపల చెరువును పరిశీలిస్తున్న మత్స్య కళాశాల విద్యార్థులు

నేడు చలో హైదరాబాద్

పాన్‌గల్: పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్, సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి పంచాయతీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి సూర్యవంశరాము బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నిత్యం దైవారాధన చేయాలి

పెబ్బేరు రూరల్: అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వ్యవస్థాపకుడు రాజేదేశ్ పాండే గురుస్వామి సూచన మేరకు బుధవారం అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి రాష్ట్ర నాయకుడు వడ్డె ఈశ్వర్, వనపర్తి జిల్లా అధ్యక్షుడు ముత్తుస్వా మి, జిల్లా వర్కింగ్ కమిటీ కన్వీనర్ గొడుగు బాలవర్ధన్ ఆధ్వర్యంలో పెబ్బేరు మండల అయ్యప్ప దీక్ష సమితి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అల్వాల ప్రదీప్‌గౌడ్, ఉపాధ్యక్షులు కరెంటు గోపాల్, మునీశ్వర్, సతీష్, వెంకట్, రాములు, ప్రధాన కార్యదర్శిగా బత్తుల అనిల్‌కుమార్‌గౌడ్, కోశాధికారిగా శ్రీనివాసులు, ప్రచార కార్యదర్శిగా తొండ రమేష్, సాయిగౌడ్, గౌరవ అధ్యక్షులుగా వెల్డింగ్ శ్రీనివాసులు, వేమారెడ్డి, గోవర్ధనాచారితో పాటు కార్యవర్గ సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం దైవారాధన చేస్తూ స్వామివారి కృపకు పాత్రులు కావాలని సూచించారు.

సారా విక్రేతపై కేసు నమోదు

గోపాల్‌పేట: ఏదుల మండల కేంద్రానికి చెందిన బాలమ్మ తన ఇంటి వద్ద సారా నిల్వ చేసి అమ్ముతున్నారని వచ్చిన సమాచారం మేరకు బుధవారం మహిళ ఇంట్లో పోలీసులు తనిఖీ చేయగా ఏడు లీటర్ల సారా లభించింది. పట్టుబడిన సారా స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశామని గోపాల్‌పేట ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. మండలంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడితే చట్ట పరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

తడకలే వంట గది.. పొంచి ఉన్న ప్రమాదం



జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో తడకలతో ఏర్పాటు చేసిన వంట గది

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం వసతుల కల్పనలో విఫలమవుతున్నట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాన్‌గల్ మండలంలోని జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో సరైన వంట గది లేకపోవడంతో తరగతి గదుల పక్కనే తాత్కాలికంగా తడకలు ఏర్పాటు చేసి అందులోనే వంటలు చేస్తున్నారు. వేసవి కాలం దృష్ట్యా తడకల్లో వంటలు చేస్తున్నా క్రమంలో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ఒక పక్క వంట ఏజెన్సీ మహిళలు, మరో పక్క ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంటి గది నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వీపనగండ్ల: వేసవిలో వడదెబ్బకు గురికాకుండ ఉండాలంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్లే సాధ్యమవుతుందని ఎస్‌ఐ నందికర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని డఫోడిల్స్ ఇంగ్లిష్ స్కూల్ చిన్నారులకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. చిన్నారులు వేసవిలో తల్లిదండ్రుల అనుమతి లేకుండా బయటకు వెళ్లరాదని, తప్పనిసరి పరిస్థితుల్లో వెళితే తాగునీరు, గొడుగులను తీసుకొని వెళ్లాలని సూచించారు. వేసవి సెలవుల సమయంలో విద్యార్థులు ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలను నేర్చుకోవడం లాంటి వాటిపై శ్రద్ధ చూపాలన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు కూడ వేసవిలో చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బత్తుల రాముడు, ఉపాధ్యాయులు లక్ష్మి, కళ్యాణి, రాజేశ్వరి, మాసుంబీ, మౌనిక, పార్వతి పలువురు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నందికర్

ఆదమరిస్తే.. ప్రమాదమే!

అమరచింత: పట్టణంలోని మేర్వరాజు కట్టల మిషన్ సమీపంలో రహదారిపై విద్యుత్ తీగలు బయటకి రావడంతో ఎప్పుడు విద్యుత్ ప్రమాదం జరుగుతుందో అన్న భయందోళనలు కలుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. డివైడర్ల మధ్య ఉన్న వీధిలైట్ల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు రహదారిని తవ్వి వాటిలో పాతిపెట్టి కనెక్షన్ ఇచ్చారు. ప్రస్తుతం రహదారి దెబ్బతినడంతో విద్యుత్ వైర్‌లు పైకి వచ్చాయి. అటుగా కాలినడకన వెళ్తున్న వారు అజాగ్రత్తగా అడుగు వేస్తే విద్యుదాఘాతానికి గురికాక తప్పదు. అదే విధంగా వాహనాలు సైతం విద్యుత్ షాక్‌కు గురి అయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అయ్యప్ప ఆలయం సమీపంలోని కట్టెల మిషన్ వద్ద రహదారిపై విద్యుత్ వైర్

కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్

కొత్తకోట రూరల్: విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని చదవాలని, చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని కొత్తకోట ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి అన్నారు. పట్టణ సమీపంలో గల ఎస్సీ గురుకుల బాలుర పాఠశాల (వీపనగండ్ల) విద్యార్థులకు బుధవారం రాత్రి పలు అంశాలపై అవగాహన కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అందరూ ఒకే చోట ఉండటంతో చిన్న చిన్న సమస్యలు రావచ్చని, వాటిని పట్టించుకోకుండా స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. గొడవలకు తావివ్వకుండా బుద్ధిగా చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వం గురుకులాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేసిందని, వాటిని సద్వినియోగం చేసుకొని లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దయాకర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి

పోలీసుల తనిఖీలు ముమ్మరం



పాన్‌గల్ మండలం కొత్తపేట స్టేజీ వద్ద పట్టుబడిన నగదుతో ఎస్‌ఐ



నంచర్ల గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

- పాలమూర్‌లో ఒకే రోజు రూ.15.96లక్షలు సీజ్
- మహబూబ్‌నగర్‌లో ఐదు చోట్ల ప్రత్యేక చెక్‌పోస్టులు ప్రారంభం
- జడ్చర్లలో మద్యంతో పాటు సారా సీజ్
- పాన్‌గల్‌లోనూ రూ.3.47లక్షల పట్టివేత

పాన్‌గల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కొత్తపేట స్టేజీ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.3.47 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు. ఎలాంటి రశీదు లేకుండా బొలెరా వాహనంలో వెళ్తున్న కొందరు నగదు తీసుకవెళ్తుండగా గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి రూ.50 వేలు కంటే ఎక్కువ నగదును వెంట తీసుకెళ్లాలంటే రశీదులు, బ్యాంకు కౌంటర్ ఫైల్స్ తప్పనిసరిగా ఉండాలని ఎస్‌ఐ సూచించారు.

అమరచింత: జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం వాహనాల తనిఖీలో రూ.1.11లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపారు. పెబ్బేరు నుంచి నర్వ మండలం వైపు బైక్‌పై వెళ్తున్న రామచంద్రారెడ్డిని తనిఖీ చేయగా నగదు లభించినట్లు తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.

మహబూబ్‌నగర్ క్రైం/అడ్డాకుల: సార్వత్రిక సమరానికి షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ) అమల్లోకి వచ్చింది. ఇందుకోసం ప్రత్యేక నిఘా బృందాలను కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. జిల్లా పోలీస్ శాఖ నగదు అక్రమ రవాణా, మద్యం పంపిణీకి అడ్డుకట్ట వేసేలా పోలీసులు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల సహకారంతో అనుసంధానమైన కమాండ్‌కంట్రోల్ కేంద్రంలో సిబ్బంది 24గంటల పాటు కెమెరాల ద్వారా అందుతున్న సమాచారాన్ని పరిశీలన చేయనున్నారు.

● ప్రధానంగా నగదు, మద్యం తరలించే పలు రకాల వాహనాలను ముమ్మరంగా సోదాలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ప్రతి పోలీస్‌స్టేషన్ వారీగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ప్రధాన రోడ్లతో పాటు చౌరస్తాలు, మండల కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు చేయగా రూ.15.96లక్షల నగదు పట్టుబడింది. నంచర్లగేట్ వద్ద వాహనాల తనిఖీల్లో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ గాంధీనాయక్ పాల్గొన్నారు. రూరల్ పోలీసులు భగీరథ కాలనీ వద్ద విశ్రాంత ఉద్యోగి రామ్‌లాల్ నుంచి రూ.9లక్షలు పట్టుకున్నారు. మహమ్మదాబాద్ పోలీసులు రూ.1,34,500, అడ్డాకుల టోల్ గేట్ వద్ద రూ.1.18లక్షలు సీజ్ చేశారు. సీసీకుంట రూ.2.20లక్షలు స్వాధీనం చేసుకున్నారు. దేవరకద్రలో రూ. 2.22 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగన్న తెలిపారు. కురువ చంద్రకళ ప్లాస్టిక్ కవర్లో నగదును తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. టూటౌన్ పోలీసులు హనుమాన్‌నగర్‌లో 16లీటర్ల మద్యం సీజ్ చేసి బెల్ట్ దుకాణం నిర్వహించే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. దీంతో పాటు హన్వాడ, కోయిలకొండ మద్యం సీజ్ చేయగా, జడ్చర్లలో సారాతో పాటు మద్యం సీజ్ చేశారు. ఇక జిల్లాలో ఇప్పటి వరకు రూ.17.51,500నగదు, 126.4లీటర్ల మద్యం సీజ్ చేశారు.

మంత్రి జూపల్లి మార్నింగ్ వాక్

కొల్లాపూర్: పట్టణంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఆయన నివాసం ఎదుటే ఉండే కల్లు విక్రయదారులతో మాట్లాడారు. నాణ్యమైన కల్లును ప్రజలకు విక్రయించాలని సూచించారు. రహదారి వెంట పొలం పనులు చేస్తున్న మహిళా కూలీలతో ముచ్చటించారు. పంటల సాగు, దిగుబడి అంశాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు మంత్రి సమక్షంలో చేరారు. హన్మంతునాయక్, నాగరాజు, రాజశేఖర్‌గౌడ్, కృష్ణమనాయుడు ఉన్నారు.